క్లుప్తంగా

గ్రామ సభలతో అభివృద్ధి

• డీఎల్‌డీఓ హేమసుందరరావు



రావివలస గ్రామసభలో మాట్లాడుతున్న డీఎల్‌డీఓ హేమసుందరరావు

చీపురుపల్లి: గ్రామాల అభివృద్ధికి గ్రామసభలు దోహదపడతాయని డివిజినల్ అభివృద్ధి అధికారి కె.హేమసుందరరావు తెలిపారు. మండలంలోని రావివలస సచివాలయంలో శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిర్ణీత తేదీల ప్రకారం గ్రామసభలు నిర్వహించుకోవాలన్నారు. పంచాయతీ బోర్డు సభ్యులతో కలిసి గ్రామ సభల్లో అభివృద్ధిపై చర్చించుకోవాలని సూచించారు. తద్వారా గ్రామాల అభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పనస మణికంఠ, తదితరులు పాల్గొన్నారు.

దుప్పట్లు, చీరల పంపిణీ



దుప్పట్లు, చీరలు పంపిణీ చేస్తున్న సంస్థ సభ్యులు

గంట్యాడ: మండలంలోని నరవ లెప్రసీ కాలనీకి చెందిన 150 మంది వ్యాధిగ్రస్తులకు ఏఎంజీ ఇండియా ఇంటర్నేషనల్ విశాఖపట్నం సంస్థ డైరెక్టర్ డాక్టర్ అరుణకుమార్ మహంతి, డిప్యూటీ డైరెక్టర్ కెజియా దుప్పట్లు, చీరలు శుక్రవారం పంపిణీ చేశారు. స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో కాలనీ మేనేజర్ కృపాకర్‌తో పాటు ఏరియా కార్యాలయం నుంచి శ్రీనివాసరావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వితరణ



కస్తూరిబా గాంధీ విద్యాలయానికి కుర్చీలను వితరణగా అందజేస్తున్న బాలి కుటుంబ సభ్యులు

మెరకముడిదాం: మండలంలోని బుధరాయవలస గ్రామానికి చెందిన స్వర్గీయ బాలి అప్పన్నమ్మ జ్ఞాపకార్థం ఆమె భర్త బాలి అప్పారావు, కుటుంబ సభ్యులు బుధరాయవలస జెడ్పీ పాఠశాలకు, మెరకముడిదాం కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయానికి పలు సామాన్లు శుక్రవారం వితరణగా అందజేశారు. బుధరాయవలస పాఠశాలకు జిరాక్స్ మిషన్, కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయానికి పది కుర్చీలు కేటాయించారు. దాతలను పాఠశాలల ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

ఉన్నత స్థానాల్లో స్థిరపడాలి



విద్యార్థులకు నగదు అందజేసి అభినందిస్తున్న ఎంపీపీ సింహాద్రప్పలనాయుడు, తదితరులు

దత్తిరాజేరు: విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థానాలు అధిరోహించాలని ఎంపీపీ గేదెల సింహాద్రప్పలనాయుడు, జెడ్పీటీసీ సభ్యురాలు రౌతు రాజేశ్వరి అన్నారు. స్థానిక ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులు జి.విఘ్నేష్, రమణలకు దాతలు, ఉపాధ్యాయులు సమకూర్చిన నగదును శుక్రవారం వారు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పాఠశాలలో చదువుకున్న పోరలి గ్రామానికి చెందిన మిత్తిరెడ్డి కూర్మారావు కర్ణాటకలో కలెక్టర్ ఉద్యోగం చేయడం మనందరికీ గర్వకారణమన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మంత్రి అప్పలనాయుడు, గ్రామపెద్దలు మహదేవ్ ఫణీంద్రుడు, గౌరినాయుడు, భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

ముసిరాం గ్రామ సర్పంచ్‌కు అవమానం

• జెండా ఆవిష్కరణకు అవకాశం ఇవ్వని పంచాయతీ కార్యదర్శి

కొత్తవలస : మండలంలోని ముసిరాం గ్రామ సర్పంచ్ చింతల రాములమ్మకు స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా తీవ్ర అవమానం జరిగింది. స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా గ్రామ సచివాలయం వద్ద జెండాను ఎగురవేసే అధికారం గ్రామ సర్పంచ్‌కు ఉండగా... ఆ గ్రామ పంచాయతీ కార్యదర్శి శాంతకుమారి ఏకపక్షంగా వ్యవహరించి కూటమి నాయకులచే జెండాను ఆవిష్కరింపజేశారు. దీంతో గ్రామ సర్పంచ్ రాములమ్మ, వార్డు సభ్యులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీ సమావేశాలు, ప్రభుత్వ ముఖ్య కార్యక్రమాలకు సైతం కనీసం చెప్పడం లేదని వాపోయారు. రాజ్యాంగేతర శక్తులను పంచాయతీ కార్యదర్శి ప్రేరేపిస్తున్నారని సర్పంచ్, వార్డు సభ్యులు, మాజీ సర్పంచ్ చింతల పైడింనాయడు ఆందోళన వ్యక్తం చేశారు. తనకు జరిగిన అన్యాయంపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్టు సర్పంచ్ రాములమ్మ స్పష్టం చేశారు. ఉన్నతాధికారులు ఈ విషయంపై విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు.

మది నిండుగా.. జెండా పండుగ



గుర్ల: ఎంపీడీఓ కార్యాలయం వద్ద జాతీయ జెండాకు గౌరవ వందనం చేస్తున్న ఎంపీపీ ప్రమీల, అధికారులు



చీపురుపల్లి: తహసీల్దార్ కార్యాలయం వద్ద వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కళా వెంకటరావు, తదితరులు



చీపురుపల్లి: పెదనడిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల పిరమిడ్ల ప్రదర్శన



గంట్యాడ: సమరయోధుల జీవిత విశేషాలను వివరిస్తున్న ఎంపీపీ హైమావతి



వేపాడ: ఎంపీడీఓ కార్యాలయంలో జాతీయపతాకం ఆవిష్కరించిన ఎంపీపీ సత్యవంతుడు, తదితరులు



గజపతినగరం : పీఏసీఎస్ కార్యాలయంలో జెండా ఆవిష్కరిస్తున్న పీఏసీఎస్ అధ్యక్షుడు లెంక బంగారునాయుడు



గజపతినగరం రూరల్: కోర్టు ఆవరణలో జెండా ఆవిష్కరిస్తున్న న్యాయమూర్తి రాజ్‌కుమార్



గజపతినగరం: మండల పరిషత్ కార్యాలయంలో స్వాతంత్య్ర దినోత్సవంలో పాల్గొన్న ఎంపీపీ బెల్లాన జ్ఞానదీపిక, జెడ్పీటీసీ సభ్యుడు గార తవుడు, తదితరులు



గజపతినగరం రూరల్: వైఎస్సార్‌సీపీ కార్యాలయం ఆవరణలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు

భరతజాతి ఆభరణం మువ్వన్నెల జాతీయ పతాకం శుక్రవారం మురిసి మెరిసింది. వాడవాడలా స్వాతంత్య్ర దినోత్సవ సంబరాలు ఘనంగా జరిగాయి. పాఠశాలలు, కళాశాలలు, ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల వద్ద జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా జాతీయ పతాక విశిష్టతను.. సమరయోధుల త్యాగాలను స్మరించుకున్నారు. భారత్‌మాతాకీ జై.. వందేమాతరం.. అంటూ జాతీయ పతాకానికి సెల్యూట్ చేశారు. కార్యక్రమాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



వేపాడ: సోంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల పిరమిడ్ విన్యాసాలు



దత్తిరాజేరు: ఎంపీడీఓ కార్యాలయంలో జెండా ఎగురవేసిన ఎంపీపీ గేదెల సింహాద్రి అప్పలనాయుడు



మెరకముడిదాం: ఎంపీడీఓ కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీపీ తాడ్డి కృష్ణవేణి



లక్కవరపుకోట: జమ్మాదేవిపేట జ్యోతిరావుఫూలే బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థుల విన్యాసం



జామి: ఎంపీడీఓ కార్యాలయంలో జెండా ఎగురవేస్తున్న ఎంపీపీ అరుణ



ఎస్.కోట: మండల రెవెన్యూ కార్యాలయంలో జాతీయ పతాకానికి వందనం చేస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి



కొత్తవలస : కోర్టు వద్ద జెండాను ఆవిష్కరిస్తున్న జూనియర్ సివిల్ జడ్జి సముద్రాల విజయచంద్ర

ఆలయాల్లో శ్రావణ సందడి



గుర్ల: మండల కేంద్రంలోని దుర్గాదేవి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



చీపురుపల్లి: చీరల అలంకరణలో కనకమహాలక్ష్మి



చీపురుపల్లి: జాతీయ జెండా రంగుల అలంకరణలో మానసా దేవి నాగశక్తి అమ్మవారు



జామి: ప్రత్యేక అలంకరణలో జామి కనకదుర్గ

శ్రావణమాస శుక్రవారం సందర్భంగా ఆలయాలకు భక్తులు పోటెత్తారు. ముఖ్యంగా మహిళా భక్తులు వేకువజాము నుంచే అమ్మవార్లను దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. అలాగే సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. అమ్మవార్లను ఈ సందర్భంగా గాజులు, పసుపుకొమ్ములు,చీరలతో ప్రత్యేకంగా అలంకరించారు.



చీపురుపల్లి: కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో కుంకుమ పూజలు



వేపాడ: కుమ్మపల్లిలో నూకాలమ్మ ఆలయంలో కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

మద్యం విక్రయాలు జరగకుండా చర్యలు

• సర్కిల్ ఇన్‌స్పెక్టర్ చక్రవర్తి

చీపురుపల్లి: స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎలాంటి మద్యం విక్రయాలు జరగకుండా పటిష్ట చర్యలు తీసుకున్నట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ చక్రవర్తి తెలిపారు. ఈ మేరకు సర్కిల్ పరిధిలో గల అన్ని మద్యం దుకాణాలకు సీళ్లు వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో గల చీపురుపల్లి, గరివిడి, మెరకముడిదాం మండలాల్లో ఉన్న 19 మద్యం దుకాణాలకు సీల్ వేసి, ఎలాంటి బ్యాక్ డోర్ అమ్మకాలు జరగకుండా ప్రత్యేక పర్యవేక్షణ ఏర్పాటు చేశామన్నారు. అలాగే తమ సిబ్బంది బృందాలుగా ఏర్పడి గ్రామాల్లో పర్యటించారని చెప్పారు. ఈ క్రమంలో గరివిడి మండలంలోని కోడూరులో మద్యం విక్రయిస్తున్న ఒకరిని అదుపులోకి తీసుకుని, ఏడు మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.



మద్యం దుకాణానికి సీల్ వేసిన సర్కిల్ ఇన్‌స్పెక్టర్ చక్రవర్తి, సిబ్బంది

ఉచిత బస్సు ప్రారంభం

గజపతినగరం/శృంగవరపుకోట: స్త్రీ శక్తి పథకంలో భాగంగా మహిళలు ఉచిత బస్సు పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. గజపతినగరం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో మంత్రి శ్రీనివాస్, ఎస్.కోట ఆర్టీసీ డిపోలో ఎమ్మెల్యే లలితకుమారి శుక్రవారం ఉచిత బస్సులను ప్రారంభించారు. కార్యక్రమాల్లో పలువురు నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

ఆందోళన

కొత్తవలస: మండలంలోని అప్పన్నదొరపాలెం గ్రామం నుంచి దారలోవ సమీపంలో గల అమ్మవారి గుడికి వేస్తున్న విద్యుత్ లైన్‌ను ఆపాలంటూ ఆ గ్రామ గిరిజనులు శుక్రవారం ఆందోళన చేపట్టారు. అమ్మవారి గుడి పేరిట అక్కడ బడా వ్యాపారులకు విద్యుత్ లైన్ వేస్తున్నారని వారు ఆరోపించారు. విలువైన భూముల పైనుంచి లైన్ వేయడం వల్ల తమ భూములకు నష్టం వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యుత్ లైన్ ఏర్పాటుకు తాము వ్యతిరేకం కాదని.. అయితే విలువైన భూములకు నష్టం లేకుండా విద్యుత్ శాఖాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

డీఎస్సీలో మెరిసిన రామానాయుడు



మరడాన రామానాయుడు

మెరకముడిదాం: ఇటీవల విడుదలైన డీఎస్సీ ఫలితాల్లో మండలంలోని గర్భాం గ్రామానికి చెందిన మరడాన రామానాయుడు మ్యాథ్స్ స్కూల్ అసిస్టెంట్ విభాగంలో 89.76 మార్కులు సాధించాడు. ఎటువంటి కోచింగ్ తీసుకోకుండానే రామానాయుడు మంచి మార్కులు సాధించడంతో తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు అభినందించారు. అలాగే రామానాయుడు ఇప్పటికే రైల్వే ఉద్యోగానికి, ఎక్సైజ్ హవల్దార్‌గా కూడా ఎంపికయ్యాడు.

పింఛన్లు తొలగించడం అన్యాయం

వేపాడ: మండలానికి చెందిన అర్హులైన దివ్యాంగుల పింఛన్లు తొలగించడం బాధాకరమని టీడీపీ మండల అధ్యక్షుడు గొంప వెంకటరావు శుక్రవారం ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో డాక్టర్లు ఇచ్చిన సర్టిఫికెట్లను ఇప్పుడు రద్దు చేయడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. జిల్లాలో ఎక్కడా లేనివిధంగా ఎస్.కోట ఏరియా ఆస్పత్రికి పరిశీలనకు వచ్చిన ధ్రువపత్రాలను పరిశీలించిన వైద్యాధికారిని తొలగించడానికి ప్రయత్నించడం సరికాదన్నారు. దివ్యాంగుల ధ్రువపత్రాల రద్దుపై న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని స్పష్టం చేశారు. ఇప్పటివరకు బానాదిలో 21, ఆతవలో 21, జగ్గయ్యపేటలో 15, శింగరాయిలో 51 చామలాపల్లి సచివాలయం పరిధిలో 15 పింఛన్లు తొలగించారని పేర్కొన్నారు.